క్లుప్తంగా

విజ్ఞాన్ వర్శిటీ విద్యార్థికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థి మాగులూరి నాగార్జునకు తమ వర్శిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ''డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏ కస్టమైజ్డ్ గైట్ అసిస్టివ్ డివైజ్ ఫర్ ఫుట్ డీఫార్మిటీ డిజార్డర్స్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ 3డీ ప్రింటింగ్ ప్రాసెస్ పారామీటర్స్'' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన నాగార్జునను పలువురు అభినందించారు.

ఎయిమ్స్‌కెళ్లి..పింఛను ఇచ్చి..



చేబ్రోలు: వలంటీర్ల సేవలు అవ్వా తాతల మొహాల్లో వెలుగులు నింపుతున్నాయి. శేకూరు గ్రామానికి తట్టుకూళ్ల జానకమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ రేపూడి ప్రకాశరావు మంగళగిరి వైద్యశాలకు వెళ్లి జానకమ్మకు పింఛను నగదు అందించాడు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు వలంటీర్ సేవలను అభినందించారు.

ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడమే లక్ష్యం



నెహ్రూనగర్: నగర ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించేలా నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో పార్కుల్ని అభివృద్ధి చేసి, వాటి నిర్వహణలో స్థానికుల్ని భాగస్వాముల్ని చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఆమె గురువారం టీచర్స్ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్డులోని వైఎస్సార్ పార్కులు, గడ్డిపాడు, రెడ్డిపాలెం చెరువుల్ని పరిశీలించారు. అభివృద్ధి పనుల వేగవంతంపై ఇంజినీరింగ్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల్లో పార్కుల్ని అభివృద్ధి చేయడానికి వార్డు సచివాలయాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పార్కుల్లో ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం పెంపు ఉండాలన్నారు. గుర్తించిన పార్కుల్లో బాస్కెట్ బాల్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్‌కు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఏఈలను ఆదేశించారు. గడ్డిపాడు, రెడ్డిపాలెం చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనల్ని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. ఆమె వెంట ఎస్ఈ(ఇన్‌చార్జ్) సుందర్రామిరెడ్డి, ఈఈ శ్రీనివాసరావు, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈలు శివకుమార్, శ్రీనివాస రెడ్డి, ఎస్ఎస్‌లు సోమశేఖర్, రాంబాబు, టీపీఎస్ హృదయరాజు, ఏఈలు రాము, అనూష, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ల ఇంటింటి సర్వేను వేగవంతం చేయండి

పాత గుంటూరు: ఓటర్ల ఇంటింటి సర్వేను బీఎల్‌ఓలు మరింత వేగంగా చేపట్టేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలని అదనపు కమిషనర్, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పెద్ది రోజా స్పష్టం చేశారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న సర్వేలో వేగం పెరగాలని, బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లాలని చెప్పారు. సూపర్‌వైజర్లు కూడా ప్రతి రోజు వారి పరిధిలో కొన్ని ప్రాంతాలకు వెళ్లి క్షేత్రస్థాయి సర్వేలో పాల్గొనాలని ఆమె ఆదేశించారు. ఏఈఆర్‌ఓలు బి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులను సహించేది లేదు..

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవరోధం కల్పిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ మండలంలో గ్రామ సచివాలయాలు, సిమెంట్ రోడ్లు, డ్రైయిన్లు, ఓహెచ్ఎస్ఆర్‌లు నిర్మాణం పూర్తి చేసుకొని, రెండుమూడేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాని పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, పనులు చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వివిధ శాఖల అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయటంలో చేస్తున్న జాప్యం.. సమస్యగా మారిందన్నారు. పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ లోపం వల్ల వీధుల్లో సేకరించిన చెత్తను రోడ్లపై వేసి నిప్పు పెడుతున్నారని, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేయాలని ఆయన ఆదేశించారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తూ అభివృద్ధి పనులకు తిలోదకాలు ఇస్తున్న అధికారులను, సిబ్బందిని ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనితీరు మార్చుకోవాలని ఆయన కోరారు. ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే ఎం బుక్‌లో రికార్డ్ చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి బిల్లులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఈ వెంకట నారాయణ మాట్లాడుతూ మునిపల్లె గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దారు వాసు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, హెచ్‌వో పి.ఉష, ఏవో దేగల వెంకట్రామయ్య, ఏపీఎం గోపీ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



కిట్లు అందజేస్తున్న సర్పంచ్ పర్వీన్ సుల్తానా



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరత్నం

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం వెంకటరత్నం అన్నారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా తల్లిపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు వ్యాధినిరోధక టీకాల పనిచేస్తాయని తల్లులకు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

తల్లీబిడ్డ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పుల్లడిగుంట సర్పంచ్ షేక్ పర్వీన్ సుల్తానా అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం లబ్ధిదారులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లును అందజేశారు. శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగవుతుందని తెలిపారు. గ్రామ సెక్రెటరీ రవి, అంగన్వాడీ టీచర్ అంజని పాల్గొన్నారు.

సకల శుభాలను చేకూర్చటం కోసం రాజశ్యామల యాగం



మామిళ్లపల్లిలో రాజశ్యామల యాగంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: రాష్ట్రానికి సకల శుభాలను చేకూర్చి, రాజ్యం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పరమ పవిత్రమైన రాజశ్యామల యాగాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో బజరంగ్ ఫౌండేషన్ చేపట్టింది. బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో మొదలైన రాజశ్యామల యాగం గురువారం రెండో రోజుకు చేరుకుంది. గ్రామదేవత పెద్దేటమ్మతల్లి వద్ద ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీకాళహస్తికి చెందిన వేద పండితులు వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ మహాలక్ష్మి, సుదర్శన హోమాలను బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చేతుల మీదుగా జరిపించారు. లోక కల్యాణార్థం సకల జనులకు శుభాలను ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం సరికొత్త పుంతలు తొక్కుతూ అభివృద్ధి పథంలో కొనసాగించాలని ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ ఆకాంక్షించారు. దీపా లక్ష్మి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా కొనసాగుతున్న రాజశ్యామల యాగం సత్ఫలితాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అభిలాషించారు. రాజశ్యామల యాగం చివరి రోజున మామిళ్లపల్లిలో పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చిన ఇటికంపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



చిన ఇటికంపాడులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం చిన ఇటికంపాడు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ఎమ్మెల్యేకు సాదరంగా ఆహ్వానం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. సంక్షేమ కరపత్రాలను అందజేశారు. చిన ఇటికంపాడు జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, త్వరితగతిన పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం ఇంటింటికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి, మోసగించటం కోసం దుష్ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఇటికంపాడు, రమణప్పపాలెం గ్రామాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇటికంపాడు గ్రామ సర్పంచ్ ఆకిశెట్టి గాంధీ, అమెరినేని సాంబశివరావు, చిలకా సుధాకర్, ఎంపీటీసీ నార్నిపాటి నాగరాజు, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాస రావు, ఈవోపీఆర్డీ జ్యోతి, ఆదిశేషు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నంబూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో నంబూరు గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఆ శాఖ ఏఈ బత్తుల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

పత్తి పంట క్షేత్రస్థాయి పరిశీలన



గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చని లాం ఫాం పత్తి విభాగం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధారాణి తెలిపారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలో పత్తి పంటలో తెగుళ్ల నివారణపై క్షేత్రస్థాయి రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో పత్తిలో చీడపీడల నివారణను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం మండల అధికారి కె.గురవయ్య పత్తి పంటను పరిశీలించి, తెగుళ్లు, పురుగులు నివారణ విధానాలను రైతులకు వివరించారు. పత్తిలో అంతర పంటలు వేయడం వల్ల అధిక ఆదాయం ఉంటుందని తెలిపారు. సరిహద్దు పంటగా సజ్జ, జొన్న, మొక్క జొన్న వేయడం వల్ల.. మిత్ర పురుగులు పెరుగుతాయని, వర్షాకాలంలో తెగుళ్లను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ సి.రాణి, డాక్టర్ దయానా గ్రేస్, రైతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణకు పేర్లు నమోదు చేయించుకోండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అకాడమీ ఇన్‌చార్జి షేక్ అత్తాఫ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీలోపు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర బొమ్మ దగ్గరలోని ఉర్దూ అకాడమీ సెంటర్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్స్ ఇవ్వటం జరుగుతుందని, అలాగే ఉద్యోగ అవకాశాలు చూపించటం జరుగుతుందని వివరించారు. వివరాలకు 94911 43050 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన

గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): ఓటర్ల జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించడం జరుగుతుందని గుంటూరు ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద గ్రామాల్లో డోర్‌టుడోర్ సర్వే జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని కోయవారిపాలెంలో గురువారం ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను స్వయంగా పరిశీలించారు. బీఎల్వోలు కచ్చితంగా సర్వే చేయాలని ఆదేశించారు. ఆర్ఐ సాహితి, వీఆర్వో రాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్ తదితరులున్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

సమగ్రంగా ఓటరు జాబితా సర్వే

పెదకాకాని: నిబంధనల ప్రకారం ఓటరు జాబితా సమగ్ర సవరణ సర్వే జరగాలని తహసీల్దారు పి.రత్నం అన్నారు. మండలంలో నంబూరు రెయిన్‌ట్రీ పార్కులో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇంటింటి సర్వే పక్కాగా జరగాలని సిబ్బందికి సూచించారు. బూత్‌లెవల్ అధికారి అనీష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు



జీవన ఎరువులను రైతులకు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబిరంగు పురుగుల నివారణ చర్యలు ముందు నుంచి పాటించాలని లాంఫాం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జీఎంవీ ప్రసాదరావు తెలిపారు. గురువారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నాగపూర్‌కి చెందిన కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం ప్రాంతీయ పరిశోధన స్థానం సంయుక్తాధ్వర్యంలో పత్తి పంటలో మేలైన యాజమాన్య పంటల గురించి రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ గులాబిరంగు పురుగుల నష్టాన్ని అరికట్టడానికి సమగ్ర సస్య రక్షణ ఒక్కటే మార్గమని తెలిపారు. నత్రజని ఎరువును ఎక్కువగా వినియోగించరాదని సూచించారు. ఎకరానికి 20 వరకూ లింగాకర్షక బుట్టలను పంటలో ఏర్పాటు చేయాలన్నారు. భూమి సారాన్ని పెంచేందుకు జీవన ఎరువులను వినియోగించాలన్నారు. జీవన ఎరువులను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, సహ ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్లు డాక్టర్ దయానా, డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి, డాక్టర్ కె.శివారెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాణి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే తహసీల్దారు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వినూత్న కార్యక్రమం



ఓటీఎస్ పట్టా అందజేస్తున్న తహసీల్దారు గోపాలకృష్ణ

శేకూరు(చేబ్రోలు): అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వినూత్నంగా ప్రజల వద్దకే తహసీల్దారు కార్యక్రమాన్ని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ చేపట్టారు. గత నెలలో చేబ్రోలు తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కేవీ గోపాలకృష్ణ మండలంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ సమస్యలకు త్వరతగతిని పరిష్కారం చూసేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. శేకూరు గ్రామ సచివాలయంలో గురువారం ప్రజల వద్దకే తహసీల్దారు కార్యక్రమం చేపట్టారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. భూ సమస్యలకు పరిష్కారం చూపారు. ఇప్పటికే మండలంలోని గొడవర్రు, మంచాల, శ్రీరంగపురం, సుద్దపల్లి గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను 90 శాతం అక్కడికక్కడే పరిష్కరించారు. 40 రోజుల్లో మండలంలో ఆరు వేలకు పైగా వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేయటం విశేషం. శ్రీరంగపురం గ్రామంలో చిన్న సాంకేతిక సమస్యతో 98మందికి ఏడాదికి పైగా కార్యాలయంలో నిలిచిపోయిన ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పట్టాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి అందించటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. 2021 డిసెంబర్‌లో ఓటీఎస్ కింద నామమాత్రపు రుసుముతో పేదల రుణాలు, వడ్డీ మాఫీ చేసి ఇంటిపై పూర్తి హక్కులు కల్పించారు. ఇటీవల సుద్దపల్లి గ్రామంలో జఠిలంగా ఉన్న రైతుల సాగునీటి కాలువ సమస్యను ఇరు పక్షాలకు చెందిన రైతులతో మాట్లాడి పరిష్కరించారు. శేకూరుపాలెం శ్మశానవాటిక స్థలం సమస్యకు పరిష్కార మార్గం చూపారు. సమస్యాత్మక ప్రాంతమైన గొడవర్రు గ్రామంలో రెండు కమ్యూనిటీల మధ్య సమస్య కారణంగా అపరిష్కృతంగా ఉన్న కాలువ సమస్యను సామరస్యంగా తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పరిష్కరించారు.

● బీఎల్‌ఓ సస్పెన్షన్

నెహ్రూనగర్: ఎన్నికల విధులకు హాజరు కాకుండా, ప్రొసీడింగ్స్ తీసుకోకుండా విధులకు గైర్హాజరవుతున్న 97 సచివాలయం వార్డు ప్లానింగ్ (బీఎల్‌ఓ) సెక్రటరీ వజ్రాల రాజ శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

బుర్రిపాలెంలో బుల్లోడు కాంస్య విగ్రహం



తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఆయన సొంతూరు బుర్రిపాలెంలో ఈనెల 5న ఆవిష్కరించనున్నారు. ఆరోజు ఉదయం జరిగే ఆవిష్కరణకు కృష్ణ సోదరుడు, ప్రముఖ సినీనిర్మాత జి.ఆదిశేషగిరిరావు సహా పలువురు సినీరంగ ప్రముఖులు హాజరుకానున్నారు. ఆరోజు విజయవాడ నుంచి తెనాలి సమీపంలోని బుర్రిపాలెం వరకు ర్యాలీని కూడా నిర్వహించనున్నారు. గతేడాది నవంబరు 15న కృష్ణ హైదరాబాద్‌లో కన్నుమూసిన విషయం తెలిసిందే. స్వస్థలమైన బుర్రిపాలెంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు అభిమానులు తలపెట్టారు. వారి సూచన ప్రకారం స్థానిక సూర్యశిల్పశాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలు, 'అగ్నిపర్వతం' సినిమాలోని గెటప్‌తో ఏడు అడుగుల కృష్ణ రూపాన్ని రూపొందించారు. గ్రామసెంటరులో ఈ విగ్రహం ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

■ సినిమారంగంలో సాధించిన విజయాలు, చేసిన ప్రయోగాలు, వెండితెరకు అద్దిన సరికొత్త సొబగులతోనే ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి 'సూపర్‌స్టార్'అయ్యారు. ఆయన తల్లిదండ్రులు నాగరత్నమ్మ, వీరరాఘవయ్య చౌదరి. 1943లో మే 5న బుర్రిపాలెంలో జన్మించారు కృష్ణ. ఆయనకు ఇద్దరు సోదరులు జి.హనుమంత రావు, జి.ఆదిశేషగిరిరావు. ఇద్దరు సోదరీమణులు. ఇక్కడి తాలూకా హైస్కూలు, ఏలూరులో కాలేజీ చదువు పూర్తిచేశారు. 'తేనె మనసులు' సినిమాతో వెండితెర హీరో అయ్యారు. బాపు 'సాక్షి'తో తో నటుడిగా పదునెక్కారు. 'గూఢచారి 116' సినిమాతో నవ చరితకు నాందిపలికారు. 350 సినిమాల్లో నటించిన కృష్ణ, అశేష ప్రజానీకానికి సూపర్‌స్టార్‌గా ఎదిగారు. జ్యోతిచిత్ర సినిమా పత్రిక నిర్వహించిన బ్యాలెట్‌లో వరుసగా అయిదేళ్లు కృష్ణ సూపర్‌స్టార్‌గా ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వం ఆయన్ను పద్మభూషణ్‌తో గౌరవించింది. కృష్ణ సతీమణి ఇందిరాదేవి. 1965లో వీరికి వివాహమైంది. భార్య స్వగ్రామం తెనాలి దగ్గర్లోని కంచర్లపాలెం గ్రామం. సహచరి విజయనిర్మలతో కలిసి 40 సినిమాల్లో నటించారు. పద్మాలయా బ్యానర్‌పై 16 సినిమాలు తీశారు. ఆయన కుమారుడు రమేష్‌బాబు, భార్య ఇందిరాదేవి ఆరునెలల వ్యవధిలో మరణించటంతో కృష్ణ కుంగిపోయారు.

■ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నా జన్మస్థలి బుర్రిపాలెంను మరువలేదు సూపర్‌స్టార్ కృష్ణ. అవకాశం ఉన్నపుడల్లా గ్రామానికి వచ్చారు. కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్ని సినిమాలనూ చిత్రీకరించారు. ప్రస్తుతం ఆయన తనయుడు, ప్రిన్స్ మహేశ్ బాబు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు.